# రూపనామములు వేరైనా బ్రహ్మతత్త్వము ఒక్కటే!

నపుణ్యం నపాపం నసౌఖ్యం నదుఃఖమ్
నతీర్థో నక్షేత్రం నమే దాన యజ్ఞమ్
న అహం భోజనం నైవ భోజ్యం నభోక్తా
చిదానంద రూపం శివోహం శివోహం

దృశ్యకల్పితమైన ఈ జగత్తునందు పుణ్యమన్నది లేదు, పాపమన్నది లేదు. సుఖముగానీ దుఃఖముగానీ లేదు. ఈ జగత్తునందు క్షేత్రమన్నదిగానీ లేక తీర్థమన్నదిగానీ ఎక్కడను కనిపించదు. దానము, ధర్మము, యజ్ఞము, యాగము యిత్యాది పుణ్యకర్మలు ఎక్కడను లేవు. ఇక్కడ భోజనంగానీ, భోక్తగానీ ఏమాత్రము కనిపించదు. చిదానందరూపం, శివోహం. దివ్యమైన పరిపూర్ణమైన జ్ఞానస్వరూపమైన చిదానందము తప్ప అన్యము ఏదీ ఈ జగత్తులో కానరాదు. కంటికి కనిపించునది, చెవులకు వినిపించునది, మనసుకు అనిపించునది, హృదయమును మురిపించునది, మైమరపించునది, అంతయు ఒక్క బ్రహ్మయే! సర్వము బ్రహ్మమయమే! దీనిని పురస్కరించుకొనియే వేదాంతము 'సర్వం ఖల్విదమ్ బ్రహ్మ' అన్నది.

## దేహాభిమానమనే భ్రమ ఉండినంతవరకు ఆత్మాభిమానమనే బ్రహ్మ లభ్యము కాదు

దృశ్యములు, రూపనామములు భిన్నభిన్నముగా మనకు గోచరమైనప్పటికిని అన్నింటియందు ఉన్నది ఒకే ఏకత్వం. అదే చిదానందరూపం. ప్రతి జీవి ప్రతి పదార్థము ఆనందమునుండే ఉద్భవించుచున్నది. ఆనందమునందే జీవించుచున్నది. కడపటికి ఆనందమునందే చేరిపోవుచున్నది. సర్వము ఆనందమే! ఆనందము తప్ప అన్యమేమాత్రం మనకు కానరాదు. కానీ ఉపాధిభ్రాంతిచేత, దేహాత్మ చింతచేత అనేక సుఖదుఃఖములు, కష్టనష్టములు మనకు గోచరించుచున్నవిగానీ యివన్నీ మానవుని భ్రమలే! దేహాభిమానమనే భ్రమ ఉండినంతవరకు ఆత్మాభిమనే బ్రహ్మ మనకేమాత్రము లభ్యముకాదు. అంతా

srisathyasaivachanamrutam

బ్రహ్మనుండి ఆవిర్భవించినదే. ఈ బ్రహ్మతత్త్వము అర్థము కావలెనన్న ఏకత్వమును కొంత తెలుసుకోవాలి. ఈ ఏకత్వమనే దివ్యత్వముద్వారా పవిత్రమైన ఆత్మతత్త్వము మనకర్థమవుతుంది

**సూక్ష్మమైనట్టి అణువున సూక్ష్మ మగుచు**
**మేటి వస్తువునందున మేటి యగుచు**
**అంతటను సర్వసాక్షియై యలరునట్టి**
**ఆత్మయే బ్రహ్మ, బ్రహ్మమే ఆత్మయగును**

యద్దృశ్యం తన్నశ్యం. ఈ కనుపించునదంతయు మార్పు చెందునదేగానీ స్థిరమైనదికాదు. నిత్యసత్యమై నిర్గుణమై ఉన్న సత్‌చిత్‌ఆనందతత్త్వము తప్ప అన్యము ఈ జగత్తునందు కనిపించదు.

**నీటియందె పుట్టి నీటియందె పెరిగి**
**నీటియందణంగు నీటిబుడగ**
**నరుడు బుద్బుదంబు నారాయణుడు నీరు**
**ఉన్న మాట తెలుపుచున్న మాట.**

**సర్వము దైవమయముగా చింతించాలి**

అనంతమైన సాగరమందు అసంఖ్యాక తరంగములు పుడుతూ ఉంటాయి, పెరుగుతుంటాయి. తరంగములు భిన్నభిన్నరూపనామములు ధరించినప్పటికి అందులోనున్నది సముద్ర జలమే! అంతకంటె మరొక పదార్థము అందులో కనిపించదు. ఈ జగత్తునందు కనిపించే పర్వతములు అన్నీ కేవలము మృణ్మయము, శిలామయము. పంచభూతములకు మించిన పదార్థము ఈ జగత్తునందు ఎంత వెతికిచూచినా కానరాదు. ఈ పంచభూతములే పరమాత్మతత్త్వములు. ఆరవ భూతము మనకు ఏమాత్రము కనిపించదు. ప్రతి మానవునియందు ఈ పంచ భూతములు సమముగా నున్నవి కనుక ప్రతి మానవుడు బ్రహ్మస్వరూపుడే! కానీ అనిత్యము, అశాశ్వతము, అసత్యమైన నీటిబుడగవంటి దేహమునే మనము భ్రాంతితో సత్యమని భావించి తద్వారా అసత్యమును పెంచుకుంటున్నాంగానీ

sri sathyasai vachanamrutam

నిత్యసత్యమైన దైవత్వమును విశ్వసించటంలేదు. సర్వము దైవమయముగా మనం చింతించాలి. దీనికి మూలాధారతత్త్వము ఒక్కటే, అదే ఏకత్వము. అదియే ఆత్మతత్త్వము. దానినే బ్రహ్మ అనవచ్చు. తమ తమ స్థానములను పురస్కరించుకొని దానికి అనేక పేర్లను సృష్టిస్తున్నారు మానవులు. ఈ టంబ్లరులో ఉన్నది నీరు. తెలుగువారు దానిని 'నీరు' అని పిలుస్తారు. తమిల్‌వారు 'తన్ని' అంటారు. ఇంగ్లీషువారు 'వాటర్' అంటారు. హిందీవారు 'పానీ' అంటారు. సంస్కృతమువారు 'వారి' అంటారు. పేర్లు భిన్నంగా ఉండినప్పటికిని జలము ఒక్కటే! అదే విధముగా ఈ చరాచర ప్రపంచమందు కనిపించే సమస్త పదార్థములు, సమస్త జీవరాసులు, బ్రహ్మస్వరూపమే! కానీ, ఆకారములు పురస్కరించుకొని దానికి అనేక రూపనామములు మనం పలుకుతున్నాం. కష్టములు, సుఖములు ప్రత్యేకంగా లేవు.

**ఆధారమే లేకపోతే ఆధేయమెక్కడ?**

> **కష్టసుఖములు రెండును కలసియుండు**
> **వాని విడదీయనెవరికి వశముగాదు**
> **సుఖము ప్రత్యేకముగనెందు చూడబోము**
> **కష్టము ఫలించెనేని సుఖంబటంద్రు.**

ఏది సుఖము, ఏది కష్టము? ఇవి రెండు మన భావములపై ఆధారపడినవే గానీ కష్టసుఖములు ప్రత్యేకంగా లేవు. కానీ ఒక్కొక్క పర్యాయము ప్రాకృతభావములు పురస్కరించుకొని ఈ భౌతికజగత్తునందు అనేక భేదములు కనిపిస్తుంటాయి. ఇవన్నీ ప్రవృత్తి లక్షణములేగానీ నివృత్తి తత్త్వములుకాదు. ప్రతి జీవి, ప్రతి ప్రాణి ప్రవృత్తి మార్గమందే తాను అభివృద్ధి పొందటానికి ప్రయత్నిస్తున్నాడుగానీ నివృత్తి విషయంలో ఏమాత్రము ప్రయత్నం చేయటంలేదు. ఆధేయమే సత్యనిత్యమని భావిస్తున్నాడు. ఆధారము లేకపోతే ఆధేయమెక్కడ? కనిపించే పచ్చని వృక్షమునకు కనిపించని వేర్లు ఆధారంగా ఉంటున్నాయి. కనిపించే భవనమునకు కనిపించని పునాదులు ఆధారంగా ఉంటున్నాయి. పునాదులు కనిపించటంలేదు. వేర్లు కనిపించటంలేదు. కానీ కనిపించనివే ఈ కనుపించే వాటికి ఆధారముగా ఉంటున్నవి. మనకు అన్ని భావములను, అన్ని దుఃఖములను, అన్ని

srisathyasaivachanamrutam

ఆనందములను కల్గించునది కనిపించనిదేగానీ కనిపించునదికాదు

**కనిపించునదే ఖాయమందురు, కనిపించనిదెల్ల కల్లయందురు**
**కనిపించనిదే తినిపించును నీ కర్మల ఫలము మర్మము జీవా!**

కర్మఫలములకు కనిపించనిదే మూలాధారము. అదియే తినిపించును కర్మఫలము. ఎన్ని శాస్త్రములు చదివినా, ఎన్ని వేదములు ఉచ్చరించినా, ఎంత మేధాశక్తి అభివృద్ధి గావించుకున్నా, ఎంతటి విద్యలు నేర్చినప్పటికిని, అధికారములో ఉన్నతస్థాయియందున్నప్పటికి, ఇవన్నీ ప్రాకృతమైన స్థితులేగానీ నిత్యసత్యమైన తత్త్వమునకు సంబంధించినవికావు. ఇవన్నీ మానసికతత్త్వముయొక్క వికారములే. మనస్సు వికారములే మానవునికి యిన్ని విధములైన భ్రమలు కలిగిస్తున్నాయి. ఈ భ్రమనుండి మనము ఏనాడు తప్పించుకుందుమో ఆనాడే మనకు బ్రహ్మ ప్రాప్తిస్తుంది. అయితే ఈ జగత్తునందు కొన్ని బాధలు, దుఃఖములు, అశాంతులు, అక్రమములు, అనాచారములు, అసత్యములు అభివృద్ధి పొందుతుంటాయి. ఇవన్నీ లోకనాటకమునకు సంబంధించిన చర్యలే తప్ప దివ్యమైన అనుభూతులు అనుభవించునవికాదు. ఇది కేవలం ఒక విధమైన స్వప్న దృశ్యము వంటిది.

**సత్యము దేశ, కాల ప్రభావములకతీతమైనది**

సత్యనిత్యము ఒక్కటే! 'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'. ఉన్న సత్యము ఒక్కటే! కానీ అనేకమంది అనేక పేర్లతో పిలుస్తూవస్తున్నారు. సాయినాథ్ అడిగాడు. 'సత్యముయొక్క దివ్యత్వాన్ని, సత్యముయొక్క పవిత్రతను, సత్యముయొక్క స్వరూపమును చక్కగా వివరించి చెప్పాలి, స్వామీ' అని. సత్యము దేశకాల ప్రభావముల కతీతమైనది. ఏదేశమైనా, ఏకాలమైనా, ఏ యుగమందైనా సత్యము, సత్యమే! ఏకం సత్. ఆ సత్యమే దైవస్వరూపము. ప్రపంచములో సర్వత్రా వ్యాపించినది, శాశ్వతమైనది, నిత్యమైనది, సత్యము ఒక్కటే! అదే ప్రత్యక్షదైవము. కనుకనే ప్రాచీన కాలమునుండి భారతీయసంస్కృతి 'సత్యంవద, ధర్మంచర' అని ప్రబోధిస్తూ వచ్చింది. ఈ సత్యమునే జగత్తంతా ఆధారంగా తీసుకొన్నది. ఈ జగత్తుని మోయునది సత్యమే! సత్+ఇ+ఎమ్=సత్యము. సత్-ప్రాణము, ఇ-అన్నము,

sri sathyasai vahinamrutam

ఎమ్-సూర్యుడు. ఈ ప్రాణమునకు అన్నము ఆధారము. అన్నమునకు సూర్యుడు ఆధారము. సూర్యకాంతిచేత జలమును ఆవిరిగా మార్చుకొని, మేఘములుగా రూపొందింపచేసి తద్వారా వర్షముగా కురిసి ఆ వర్షముద్వారా జగత్తునంతా సస్యశ్యామలంచేస్తున్నాది. పంటలను పండిస్తున్నాది. ఆహారమునందిస్తున్నాది. కనుక జగత్తంతయు ప్రాణము, అన్నము, సూర్యుడు యీ మూడింటిపై ఆధారపడి ఉంటున్నది. అదియే సత్-ఇ-ఎమ్=సత్యము.

**సత్యస్వరూపుడైన దైవమును పొందాలనుకున్నప్పుడు ప్రేమతత్త్వమును అనుసరించాలి**

ఈ సత్యమును మనము ఏ విధంగా గుర్తించగలము? సత్య ఇది ఒక పదము. ఇది సత్-ఇ-య=సత్య. ఇంతేకాక స-త-య=సత్య. కానీ స-త-య మనం తిప్పిచెప్పినప్పుడు య-త-స అవుతుంది. 'య' యమనియమాది లక్షణములచేత, 'త' అనే తపస్సు ఆచరించినప్పుడు, 'స' అనే సత్యస్వరూపుడుగా సాక్షాత్కరిస్తాడు, భగవంతుడు. యమనియమాది మార్గములచేత తకారమనే తపస్సాచరించినప్పుడు సకారమనే సత్యస్వరూపుడు సాక్షాత్కరిస్తాడు. దీనినే అష్టాంగయోగములని వేదాంతము ప్రబోధిస్తూ వచ్చింది. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యాన, సమాధి. ఈ యోగములన్నీ శారీరకమైన, ప్రాకృతమైన, భౌతికమైన లోకమునకు సంబంధించినవేగానీ దైవమునకు యివేమీకాదు, ఒక్క ప్రేమయోగము తప్ప. యోగమనగా చేరిక. ఈ చేరేది ఒక్క ప్రేమతత్త్వము తప్ప అన్యమార్గము ఏమాత్రము దీన్ని చేరటానికి అవకాశముండదు. కనుక సత్యమనే దైవత్వమును మనం పొందాలనుకున్నప్పుడు ప్రేమతత్త్వమును అనుసరించాలి. ప్రతి మానవునికి కొన్ని విలువలు చాలా అవసరం. విలువలులేని మానవత్వమునకు యిందులో స్థానముండదు. అగ్నికి విలువ ఏమిటి? కాల్చేశక్తి ఉంటున్నది. దహనశక్తియే లేకుండిన అది అగ్నికాదు బొగ్గవుతుంది. చక్కెర విలువ ఏమిటి? తీపిగా ఉండినప్పుడే చక్కెర అవుతుంది. ఆ తీపితనము లేక మట్టి అవుతుందిగానీ చక్కెరకాదు. మంచు గుణము ఏమిటి? చల్లదనము. ఆ చల్లదనముండినప్పుడే మంచు అవుతుందిగానీ వేడిగా ఉంటే మంచు అనిపించుకోదు. అటులనే ప్రతి పదార్థమునకు ఒక్కొక్కశక్తి ఉంటున్నది. ఆ శక్తియే,

sri sathyasai vachanamrutam

ఆ స్వరూపముయొక్క విలువ. మానవతా విలువలు ఏమిటి? ఈ విలువలు లేక మానవుడు, మానవుడుకాడు. ఆకారమానవుడే గానీ ఆచారమానవుడు కానేరడు. మానవునకు ఏది ఆధారము? సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస ఈ పంచభూతములే ఆధారము. ఈ పంచభూతములను పంచప్రాణములుగా బోధిస్తూ వచ్చింది, వేదాంతము. అదియే ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమాన. ఈ ఐదింటిని ఏకత్వము చేసినప్పుడే నిజమైన దైవత్వముగా రూపొందుతుంది. సత్యము ధర్మముతో చేరాలి. ధర్మము శాంతితో చేరాలి. శాంతి ప్రేమతో చేరాలి. ప్రేమ అహింసతో చేరాలి. అన్నీ ఏకమైపోతాయి. అన్నీ ఒక్కదానియందై లీనమై ఉంటున్నవిగానీ భిన్నముకాదు.

## ప్రేమలేని జీవి జగత్తులో కానరాదు

విద్యార్థులుంటున్నారు. ఈనాడు మీరు యువకులు. బ్రహ్మచర్యము, గృహస్థము, వానప్రస్తము, సన్యాసము, యివన్నీ ప్రత్యేక ఆశ్రమములే తప్ప అన్నింటియందు ఒక్కడే! బ్రహ్మచారే, గృహస్థుడౌతున్నాడు. గృహస్థుడే వానప్రస్థుడౌతున్నాడు. వానప్రస్థుడే సన్యాసిగా మారుతున్నాడు. సన్యాసమునకు వేరే రూపముగానీ, గృహస్థమునకు వేరే రూపముగానీ, వానప్రస్తమునకు వేరే రూపముగానీ, బ్రహ్మచర్యమునకు వేరే రూపముగానీ లేదు. ఒకే వ్యక్తి ఈ ఆశ్రమములందు అనేక మార్పులు చెందుతున్నాడు. అదే విధముగా ప్రేమ అనేక అకారములు ధరిస్తున్నాది. ప్రేమ ఉన్న చోట హింస ఏమాత్రము జరగదు. ప్రేమ ఉన్న చోట శాంతి పరిపూర్ణముగా ఉంటుంది. ప్రేమ ఉన్నచోట ధర్మం సక్రమంగా నడుస్తుంది. ప్రేమ ఉన్నచోట సత్యము సత్యముగానే పలుకుతుంది. గీతయందు 'అనుద్వేగకరం వాక్యం సత్యం ప్రియ హితంచ యత్' ప్రీతి ఉండినచోట సర్వము ఏకమైపోతుంది. దీనికి దేశకాల ప్రభావము ఉండదు. ప్రేమలేని జీవి, ప్రేమలేని ప్రాణి జగత్తులో కానరాదు. తనకు తెలియక పోయినా తనయందు తనకు ప్రీతి ఉంటుంది. అట్టి ప్రేమయే దైవము. అదే Love is GOD, Live in LOVE. మానవతా విలువలు ఈ విధముగా జీవితములో సార్థకము గావించుకోవాలి. మానవత్వమును ఆదర్శవంతమైన జీవతత్వముగా జగత్తుకు ఆదర్శముగా నిరూపించాలి. మానవుడు ఏ విధంగా

srisathyasaivachanamrutam

నడచుకోవాలి? మానవతా విలువలు లేక తాను మానవుడే కాదు.

## రాక్షసత్వమునుండి దైవత్వమునకు ప్రయాణము చేయాలి

మానవునియందు నాలుగు స్థాయిలుంటున్నవి. మొదటిది రాక్షసత్వము, రెండవది పశుత్వము, మూడవది మానవత్వము, నాల్గవది దైవత్వము. ఈ రాక్షసత్వమునుండి దైవత్వమునకు ప్రయాణము చేయాలి. దానవత్వమనగా ఏమిటి? దానవత్వమనగా హింసతోకూడినది. దయా దాక్షిణ్య రహితమైనది. ఇందులో దయగానీ దాక్షిణ్యముగానీ ఏమాత్రము ఉండదు. అదియే రాక్షసత్వము. రెండవది పశుత్వము. పశుత్వమనగా అజ్ఞానముతో కూడినది. నేను అనే అహంకారముతో కూడినది. ఈ అహంకారమమకారములచేతనే పశుత్వమును గుర్తించుకోలేకపోతున్నాది. అహంకారమమకారములు విసర్జించినప్పుడే మానవత్వంగా రూపొందుతుంది. ఈ మానవత్వము దివ్యత్వమును చింతిస్తూ ఉంటుంది. ఇందులో విచక్షణాజ్ఞానముంటుంది. నిత్యానిత్య పరిశీలనాశక్తి ఉంటుంది. అదియే మానవత్వము ఈ నిత్యానిత్యవిషయ పరిశీలనయందు ఆత్మ, అనాత్మ భావాన్ని గుర్తించాలి. ఏది ఆత్మ, ఏది అనాత్మ? దేహము అనాత్మ, ప్రాణం ఆత్మ. దీనినే గీత స్వధర్మము, పరధర్మము అని బోధిస్తూ వచ్చింది. స్వధర్మ. 'స్వ' అనగా ఆత్మధర్మము. దీనినే సాలోక్యం, సారూప్యం, సాయుజ్యమని సకారమునకు యింత పవిత్రమైన దివ్యత్వము ప్రాప్తించింది. సకారము ఆత్మతత్త్వముతో కూడినది. పరధర్మమనగా దేహధర్మము. కానీ గీతను అనేకమంది అనేక విధమైన బోధలచేత స్వధర్మమనగా క్షత్రియధర్మము, బ్రాహ్మణధర్మము, వైశ్యధర్మము, శూద్రధర్మముగా భావించి పాటిస్తూ వచ్చారు. ఇది చాలా పొరపాటు. అర్జునా! నీస్వధర్మము నీవు అనుసరించమంటే క్షత్రియధర్మమును అనుసరించమనా? కాదు. నీ ఆత్మధర్మము ననుసరించు. దేహధర్మము కేవలం పశుధర్మము. పరధర్మము. దేహము నీటిబుడగ. నీ దేహము జడము. ఏమాత్రము జగత్తునందు సాధించేదికాదు. దీనినే 'ఓం భూర్భువస్సువః ' భూ-దేహమే. జగత్తుకు సంబంధించినది. దీనినే materialisation అన్నారు. దేహము ఏవిధంగా కదలుతున్నాది? ఏ విధంగా సంచరిస్తున్నాది? ఏ విధంగా చరిస్తున్నాది? అదియే

sri sathyasaivachanamrutam

చైతన్యశక్తి. ఆ చైతన్యశక్తిని ఏది ఆవిర్భవింపచేస్తున్నాది? అదియే radiation. అదే ప్రజ్ఞానం. దీనినే వేదమందు 'ప్రజ్ఞానం బ్రహ్మ' అనింది. ప్రజ్ఞానము. Vibration అనే ప్రాణశక్తి. Materialisation అనే దేహశక్తి నాల్గింటి ఏకత్వమే మానవత్వము. కాబట్టి జగత్తంతయు మానవునియందే యిమిడి ఉంటున్నది.

**తనను తాను నమ్మనివాడు ఎన్ని నమ్మి ప్రయోజనం ఏమిటి?**

మానవుడు సామాన్యుడుకాదు. కేవలము ఆకారమానవుని మాత్రమే చూచి మనం వికారముగా భావిస్తున్నాము. కాదు, సర్వశక్తులు మానవునియందుంటున్నవి. ఈ శక్తిని మనం గుర్తించినప్పుడే మనం దివ్యమైన శాంతి పొందగలము. ఆ శక్తిని పొందే నిమిత్తమే మానవత్వము ప్రాప్తించింది. అట్టి శక్తిని మనం గుర్తించాలి. అప్పుడే పవిత్రమైనజన్మగా రూపొందుతుంది. 'జంతూనాం నరజన్మ దుర్లభమ్'. దాన్ని గుర్తించినప్పుడే యిది దుర్లభమవుతుంది. లేకపోతే పశుపక్షి మృగాదులవలె మనముకూడా జీవిస్తున్నాము. దుర్లభమైన జన్మ ఏమి చిక్కింది? ఎక్కడ ఉంది విశిష్టత? అన్నింటిని గుర్తించి వర్తించటమే దీని విశిష్టత. కానీ, తనయందున్న దివ్యత్వమును మానవుడు గుర్తించుటకు ప్రయత్నించుటలేదు. లౌకికమైన, భౌతికమైన, ప్రాకృతమైన యీ జగత్తునే ఆధారము చేసుకుంటున్నాడు. ఇది ఏనాటికి సత్యమైనదికాదు. యిదంతా కేవలం విద్య. ఇది కేవలము కదలిపోయే మేఘములవంటిది.

**తైతై తైతై తైబొమ్మా!**
**దీని తమాష చూడర మాయబొమ్మ!**
**అందము ప్రాయము ఇంద్రియశక్తియు**
**ఉందని నిక్కకురోరన్నా**
**ముందున్నదిరా తొందరలోనే**
**ముసలితనమ్మను ముసుళ్ళ పండుగ** ॥తై తై॥

ఏమిటి ఈ బొమ్మల ఆట? ఇదికాదు, మన జీవితము. ఈ ఆటలు కాదు, మన చర్యలు. అంతర్భావములోని ఆత్మతత్త్వము మనం గుర్తించాలి. చేసే జపములు, చేసే ధ్యానములు,

srisathyasaivachanamrutam

చేసే తపములు, చేసే భజనలు మానసికశక్తికోసమే తప్ప దైవతృప్తికోసం కాదు. దైవము ఎక్కడున్నాడు? ఏ కాశీలోనో, ఏ భద్రాచలములోనో, ఏ తిరుపతిలోనో, ఏ అమర్‌నాథ్‌లోనో దైవము ఉన్నాడనుకుంటున్నావు. చాలా పొరపాటు. అదే పెద్ద అజ్ఞానము. నీ హృదయమందే ఉంటున్నాడు, భగవంతుడు. అదే నిత్యమైన భగవంతుడు. కాశీలో ఉన్నాడంటే నమ్ముతాం, మనం వెదుతున్నాము. ఇదే మానవునియందున్న బలహీనత. 'ఓ పిచ్చివాడా! భగవంతుడు నీ హృదయమందే ఉన్నాడంటే నమ్మడు మానవుడు. బయటతట్టు ఉన్నాడ'ంటే చాలా త్వరగా నమ్ముతున్నాడు. చీకటి మార్గములో ప్రవేశిస్తున్నాడు మానవుడు. తనయందున్న దివ్యత్వమును తాను నమ్మటానికి ప్రయత్నించటంలేదు. అందుకోసమే సృష్టియందు ఒక చక్కని రహస్యము నిరూపిస్తూ వచ్చాడు, భగవంతుడు. పిచ్చివాడా! నీకు రెండునేత్రములుంటున్నాయి. ఈ రెండు నేత్రములు బయటి ప్రపంచమునంతా చూడగలుగుతున్నాయి. కోట్లమైళ్ల అంతరిక్షములోని నక్షత్రములను చూడగలుగుతున్నాయి. కానీ, కన్నులు తనను తాను చూడలేకపోతున్నాయి. ఇదియే చక్కని ఆదర్శము. అన్నింటిని మనం నమ్ముతున్నాము. తనను తాను నమ్మటంలేదు. తనను తాను నమ్మనివాడు ఎన్ని నమ్మి ప్రయోజనం ఏమిటి? అదియే self confidence. ఆ self confidence foundation. Self satisfaction wall. Self sacfifice roof. Self realisation life. అదీ మానవుని జీవితము. మొట్టమొదట ఆత్మ విశ్వాసమును పెంచుకోవాలి. ఆత్మవిశ్వాసమును పెంచుకొనక అన్య విశ్వాసము పెంచుకొని తద్వారా గుడ్డిగా నడుస్తూ పోవటంచేత అజ్ఞానమనే గుంటలో పడిపోతున్నాం.

**సంకల్పములు, మాటలు, చేతలు మూడింటి ఏకత్వము కావాలి**

విద్యార్థులారా! ఈనాటి విద్యార్థులే బావిభారతోద్ధారకులు. సత్యమునే సమాజములో మీరు పౌరులుగా చాటాలి. దైవము ప్రతి ఒక్కరి హృదయమందు ఉంటున్నాడు. కనుక, సర్వులు బ్రహ్మస్వరూపులే! ఎక్కడైనా 'నీవు ఎవరు?' అని అడిగినప్పుడు 'తత్త్వమసి', 'ప్రజ్ఞానం బ్రహ్మ', 'అయమాత్మ బ్రహ్మ' అని ధైర్యముతో చాటే వీరుడుగా నీవు తయారుకావాలి. దైవము ఎక్కడో లేదు. 'అది నేనుగా ఉన్నాను'. అట్టి ధైర్యసాహసములను



srisathyasaivachanamrutam

నేడు అభివృద్ధి గావించుకోవాలి.

**దేవుడనగ వేరు దేశమున లేడు**
**దేవుడుండు తనదు దేహమందె**
**పాపమనగ వేరు పరదేశమున లేదు**
**తానుచేయు పనుల తగిలియుండు**

మనం చేసే పనులబట్టి పాపపుణ్యాలు వస్తున్నాయి. ఈ పాపపుణ్యములకు కారణం ఏమిటి? మన సంకల్పములే! కనుక సంకల్పములు పవిత్రమైనవిగా, శుద్ధమైనవిగా, నిర్మలమైనవిగా, నిశ్చలమైనవిగా ఉండాలి. ఈనాటి మానవుని తలంపులు చాలా అపవిత్రమైనవిగా ఉంటున్నాయి. చంచలమైనవిగా ఉంటున్నాయి. పిచ్చికోతికంటె హీనమైనవిగా ఉంటున్నాయి ఇంక మానవుడని ఎట్లా పిలువబడతావు? ఛీఛీ! దైవముగానున్న మానవుని మానవునిగా పిలిపించుకోలేకపోతే నీ మానవత్వముండి ప్రయోజనం ఏమిటి? 'I am Man. నేను మనిషిని' అనే ఆత్మవిశ్వాసముండాలి. అందుకోసమే the proper study of mankind is man, అన్నారు. సంకల్పములు, మాటలు, చేతలు మూడింటి ఏకత్వము కావాలి. తలచటము ఒకటి, చెప్పటము ఒకటి, చేయటము మరొకటి, ఇది మానవత్వమునకు విరుద్ధమైన పద్ధతి. కనుకనే వేదాంతము 'మనస్యన్యత్, వచస్యన్యత్, కర్మణ్అన్యత్ దురాత్మనమ్' అని చెప్పింది. 'నీవు దురాత్ముడురా' అన్నది. చెప్పిన మాటను దక్కించుకొనే నిమిత్తమై మానవత్వమును అర్పితము గావించాలి. త్యాగము చేయాలి. బలిచక్రవర్తి వామనునికి మాట ఇచ్చాడు. నీకు 3 అడుగులు నేల యిస్తానన్నాడు. గురువు ఎంత బోధించినా వినలేదు. 'గురుజీ! చెప్పిన మాట తప్పటము మానవునకు సహజంకాదు. ఇది చాలా పాపము. కనుక నేను మాట తప్పను. నేను సర్వము అర్పితము చేస్తాను', అన్నాడు. 'పలికి బొంకుటకంటె పాపమున్నె'. పలికి తప్పించుకుంటే యింతకంటె పాపము మరొకటి ఉందా! గురువునైనా సరే ధిక్కరించి సత్యాన్ని ఉద్ధరించాలి.

## సత్య, ధర్మములను రక్షిస్తే దేశమును రక్షించినవారవుతారు

ఈనాడు మనము కాపాడవలసింది దేశమునుకాదు. విద్యార్థులారా! ఈనాడు దేశము

srisathyasaivachanamrutam

అనేక అన్యాయ, అక్రమ, అనాచారములతో కుమిలిపోతున్నది. ఈ దేశాన్ని కాదు, మనం రక్షించవలసింది. దేశము దేనిపైన ఆధారపడి ఉందో దాన్ని రక్షించాలి. సత్యధర్మములను రక్షిస్తే దేశమును రక్షించిన వారౌతారు. సత్యమును రక్షించుకోండి. ధర్మాన్ని రక్షించుకోండి. ధర్మము ఎక్కడనుండి వచ్చింది? 'సత్యాన్నాస్తి పరోధర్మ', సత్యమనే పునాదిపైనే ధర్మమనే గోడ నిల్చిఉంది. ఈ రెండింటిని మనం కాపాడుకుంటే ఆ యింటిలో మనం జీవించవచ్చు. కనుక 'సత్యం వద, ధర్మం చర' అని వేదము బోధించింది. యిది కేవలం తృప్తికోసం బోధించినది కాదు. పరమ సత్యమైనది. పరమ పవిత్రమైనది. ఇట్టి పవిత్రమైన సూక్తులను విస్మరిస్తున్నాడు, ఈనాడు మానవుడు. అనిత్యము, అశాశ్వతము, అసత్యము అయిన దానిని చక్కగా విశ్వసిస్తున్నారు. కట్టకడపటికి జీవితమంతా వ్యర్థము చేసుకుంటున్నారు. ఎందుకోసం వచ్చింది ఈ జీవితము? తిని, త్రాగి, తిరిగే దానికి వచ్చిందా? ఈ మాత్రం పనులు పశుపక్షిమృగాదులు చేయటం లేదా? ఇది కాదు, మనము చేయవలసినది. మాటను నిలుపుకోవాలి. అలాంటి పవిత్రమైన జీవితమును ఆదర్శముగా నిరూపించాలి. సత్యం-సత్యమనగా ఏమిటి? త్రికరణశుద్ధియే సత్యము. చూచింది చూచినట్టుగా, పలికింది పలికినట్టుగా, చేసింది చేసినట్టుగా చెప్పటం సత్యంకాదు. అది నిజము. నిజమునకు, సత్యమునకు చాలా వ్యత్యాసముంటున్నది. నేను చూచినప్పుడు నీవు కురతా, పైజామా వేసుకొని ఉండవచ్చును. కానీ రెండవదినము నీవు బుష్‌కోటు ధరించవచ్చు. నిన్న చూచినది నిన్నటికే సత్యము; నేటికి సత్యము కాదు. మార్పు చెందేది కనుక, నిజము. సత్యము త్రికాలాభాద్యం.

## మూడు కాలములందు మార్పు చెందనిదే సత్యము

మూడుకాలములందు మార్పు చెందనిదే సత్యము. దీనినే వేదమందు 'ఋతమ్' అన్నారు. మార్పు చెందనిది. ఎట్టి పరిస్థితులలందు మార్పు చెందనిది. దానినే సత్ అన్నారు. సత్ అనగా ఉన్నది. ఎప్పటికీ ఉన్నది, ఉన్నది అని నిరూపించేదే చిత్. ఈ సత్, చిత్ రెండింటి ఏకత్వమే ఆనందము. భగవంతునికి గల అనేక నామములందు సచ్చిదానందమనేది మహత్తరమైనది. సత్, చిత్, ఆనందము. ఈ మూడు పదములు ఎందుకు రావాలి?

srisathyasaivahini.org / srisatyasaivachanamrutam

పదములు మూడున్నాయి గానీ, ఒక్కటే సచ్చిదానందము. మనము విభజించాలి అనేక అర్థములు నిరూపించుకొని తద్వారా మనము విశ్వసిస్తున్నాము. కేవలము ప్రాథమిక స్థితిలో భావమును అనుభవిస్తున్నాము. ప్రాథమికస్థానంలో A,B,C ఈ విధంగా అక్షరాలు తీసుకుంటాము. ఈ అక్షరములు నేర్చుకున్న తరువాతనే పదములు నేర్చుకోగల్గుతాము. ఈ పదములలో అక్షరాలు చేరే ఉంటున్నాయి. పదములు నేర్చుకున్న తరువాత వాక్యములను తెలుసుకోగలుగుతున్నాము. ఈ వాక్యములు తెలుసుకున్న తరువాతనే దాని అంతరార్థమును తెలుసుకోగల్గుతున్నాము. కనుక సచ్చిదానందమనే GOD మూడు అక్షరములు. మూడు చేరి ఒకే పదము. అదే GOD. అనగా దేవుడు. G, O, D అక్షరములు వేరు. మూడింటికి ఏకత్వము చేయాలి.

**త్రిదళం త్రిగుణాకారం త్రినేత్రంచ త్రియాయుధం**
**త్రిజన్మ పాపసంహారం ఏకబిల్వం శివార్పణం.**

సత్త్వరజోతమో గుణములు మూడింటిని మనం ఏకం చేయాలి. సైన్సు పిల్లలకు తెలుసు. అన్ని రంగులు వేసి స్పీడుగా తిప్పుతే తెలుపురంగు వస్తుంది. ప్రత్యేకమైన రంగులు కనిపించవు. అదే రీతిగా మూడింటి ఏకత్వమే దివ్యత్వము. దైవము ఎప్పటికి పవిత్రమే! అందుకోసమే

**నిర్గుణం నిరంజనం సనాతనం నికేతనం**
**నిత్యశుద్ధ బుద్ధ ముక్త నిర్మల స్వరూపిణం,**

అన్నారు. కానీ ఈనాడు వేదాంతము అంతయు గ్రంథపరిచయము మాత్రమే! కానీ ఆ గ్రంథములోని సారమును తినాలి, త్రాగాలి. అందుకోసమే భగవంతుని 'రసోవైసః' అన్నారు.

**మానవునకు ఆనందమే స్వస్థానము**

రసస్వరూపుడు భగవంతుడు. ఏ రసము? కరుణారసము; ప్రేమరసము; దయారసము. ఈ మూడింటి ఏకత్వమే దివ్యత్వమైనరసము. ప్రేమతత్త్వము మనం

sri sathyasai vachanamrutam

పొందాలి. ప్రేమను అభివృద్ధి గావించుకోవాలి. ఈ ప్రేమకంటె మించిన సత్యము మరొకటిలేదు. ప్రేమ ఉన్న చోట సర్వము ఉంటున్నాది. ద్వేషమునకుగానీ అసూయకుగానీ అహంకారమునకుకానీ మమకారమునకుగానీ అవకాశమే లేదు. ప్రేమ ఏకత్వమును పెంపొందింప చేస్తుంది. ఆ unity యే నిజమైన purity. ఆ purityయే Divinity. మొట్టమొదట unity కావాలి. ఆ చేరికలో ఒక విధమైన దివ్యమైన శక్తి వస్తుంది. ఇది ఒక వస్త్రము. వస్త్రముకాదు. దారముల చేరిక. అనేక దారములు చేరటంచేత చాలా గట్టిగా ఉంటున్నాది. దారముల ఏకత్వమే పటుత్వమునకు మూలకారణము. దారములు ప్రత్యేకముగా విడివిడిగా తీసినప్పుడు వేళ్లతో త్రుంచి వేయవచ్చు. బలహీనమైపోతుంది. పదిమందిచేరి ఒక పని చేసినప్పుడు నా వెనుక తొమ్మిదిమంది ఉన్నారు అనే ధైర్యం ఇతనికి ఉత్సాహము నందిస్తుంది. నా వెనుక, ముందు, సర్వత్ర దైవమున్నాడు అనే ధైర్యము మరింత అభివృద్ధి అయినప్పుడు ఎక్కడకు పోయినా భయములేదు. God is in me, around me, above me, below me, every where. సర్వత్రా నిండినవాడు భగవంతుడే. నీటిలో చేప సంచరిస్తుంటాది. ఆ చేపకు నీరు ఎక్కడుంది? సర్వత్రా ఉంటున్నాది. అప్పుడే అది అంత ఆనందంగా సంచరిస్తుంది. అదే చేపను తెచ్చి బంగారు, వజ్ర, వైఢూర్యములు కూర్చిన కప్పులో పెడితే ప్రాణం విడుస్తుంది. ఈ రత్నముల విలువ దానికి తెలీదు. బంగారు విలువ దానికి అర్థముకాదు. 'నా స్వస్థానము కావాలి. నా స్వస్థానము జలమే. ఆ జలములోనే నాకానందము' అనుకుంటుంది. అదే విధముగా ఈనాటి మానవునికి ఏది ఆనందము? దివ్యత్వమే ఆనందము, దైవత్వమే ఆనందము, పవిత్రమే ఆనందము. ఈ ఆనందమును మరచిపోయి కేవలము గట్టున పడిన చేపవలె పరితపిస్తున్నాడు మానవుడు. పంచభక్ష్యపరమాన్నములు తినిపించు; దానికి ఏమాత్రము తృప్తికాదు. 'అయ్యా! నన్ను జలములో చేర్చ'మంటుంది. తన స్వస్థానమునకు పోయినప్పుడే తనకు శాంతి. అదే విధముగా మానవునకు శాంతి ఎక్కడ లభ్యమవుతుంది? తన స్వస్థానమునందే! అది ఏమిటి? ఆనందపిపాసి మానవుడు. ఆనందమే తన స్వస్థానము. 'బ్రహ్మానందం పరమసుఖదం కేవలం జ్ఞానమూర్తిం' ఆ ఆనందమే తన స్వస్థానము.

**ఏ కర్మలు చేసినా భగవత్ప్రీత్యర్థము అనే భావనతో చేయాలి**

srisathyasaivahini.org

ప్రతి మానవుడు ఆనందము కోరుతున్నాడు. కానీ ఈ ప్రాకృత ఆనందము నిజమైన ఆనందముకాదు. ఇవి కదలిపోయే మేఘములవంటివి. ఆకలివేస్తుంది. పరుగెత్తి క్యాంటీనుకు పోయి రెండు చపాతీలు తిన్నావు. అకలిపోయి ఆనందముగా ఉన్నాను అంటావు. ఈ ఆనందము ఎంతసేపు? రెండుగంటలసేపు మాత్రమే! తిరిగి మూడవగంటకు ఆకలి ప్రారంభమవుతుంది. ఇది ఆనందమా? కాదు. ఇది కేవలము తాత్కాలిక ఆనందము. ఇది కృత్రిమ ఆనందము. నిత్యానందం, బ్రహ్మానందం, యోగానందం, పరమానందం, అద్వైతానందం, ఆ ఆనందమే శాశ్వతానందము. అట్టి శాశ్వతానందము ఆత్మ భావమునందు మాత్రమే ఉన్నది. నీవు దేహమనే దేహాభిమానమును దూరం చేసుకొండి. మీ మీ పనులు చేసుకోవచ్చు. మీ కర్తవ్యములు మీరు పాటించవచ్చు. కానీ కాలమంతా దేహమునకే దుర్వినియోగము చేయకూడదు. కర్మలంతా దేహానికే వినియోగము చేయకూడదు. దేశమునకు కాలమునకు అవసరమైన కర్మలనాచరించాలి. సమాజ సంక్షేమమునకై ఈ కర్మలాచరించాలి. ఏ కర్మలు చేసినా భగవత్ప్రీత్యర్థమనే భావనతో చేయి. ఇది సులభమైన మార్గము. ఇంతకంటె మరొక మార్గములేదు. కనుకనే త్యాగరాజు చెప్పాడు 'రామా! కోదండరామా! రామా! పట్టాభిరామా!' అని.

**(తేదీ 22-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahinimrutam